

తొలివెలుగు జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365


TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA


విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365



| యాదాద్రిభువనగిరి | సంపుటి: 01 | సంచిక.41 | ఆదివారం | 6.సెప్టెంబర్.2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వేల రూ. 2/ |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue.41 | Sunday | 6.9.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |




## కేసీఆర్ అసెంబ్లీకి రా..

# లేదంటే రాజీనామా చెయ్..

- మా నిజాయితీ ఏందో, మీ బతుకేందో అసెంబ్లీలోనే తేల్చుకుందాం: సీఎం రేవంత్‌రెడ్డి
- ఈ నెలాఖరు సిరిసిల్లకు, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా..
- వచ్చే ఎన్నికల్లో సీట్లు పెరిగితే 115, పాతవైతే 90 సీట్లు మావే..
- 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలనే..
- నకిరేకల్ బహిరంగ సభలో ప్రసంగం

2లో

## రూ. 70 వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్

- టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ భాగస్వామ్యం
- ఒక గిగావాట్ డేటా సెంటర్.. ఏడు వేల మందికి ఉపాధి
- ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందంపై సంతకాలు
- నా కల నెరవేరింది: సీఎం రేవంత్‌రెడ్డి
- ఓఆర్ఆర్--ఫ్యూచర్ సిటీ రోడ్డుకు రతన్ టాటా పేరు పెడతామని వెల్లడి
- మాటల్లో కాదు.. చేతల్లో పెట్టుబడులు సాధిస్తున్నాం: మంత్రి శ్రీధర్‌బాబు

# విద్యార్థుల తీరుపై చంద్రబాబు ఆవేదన..

### వివేకంతో వ్యవహరించాలంటూ టీచర్లకు సూచన

- నేటి సున్నిత పరిస్థితుల్లో బోధన టీచర్లకు పెను సవాల్ అని సీఎం చంద్రబాబు అన్నారు
- గతంలో దండించేవారని, ఇప్పుడు మందలించినా ఇబ్బందులేనని వ్యాఖ్యానించారు
- విద్యార్థుల్లో పెరుగుతున్న హింసా ప్రవృత్తి, మానసిక బలహీనతలపై ఆవేదన వ్యక్తం చేశారు
- ఉద్యోగులకు 12వ పీఆర్సీ కమిటీ, రెండు డీఏల విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది
- ఏఐ వంటి టెక్నాలజీ వచ్చినా గురువుల స్థానాన్ని ఏదీ భర్తీ చేయలేదని స్పష్టం చేశారు

గతంలో దండనతో అయినా విద్యార్థులకు పాఠాలు నేర్పించే వీలుండేదని, కానీ నేటి సున్నితమైన పరిస్థితుల్లో కనీసం వారిని మందలించినా ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడంలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో విద్యాబోధన అత్యంత సవాళ్లతో కూడుకున్న అంశంగా మారిపోయిందని ఆయన అన్నారు. ఇలాంటి సున్నితమైన వాతావరణంలో ఉపాధ్యాయులు ఎంతో వివేకంతో ఆలోచించి వ్యవహారాలను చక్కబెట్టాలని పిలుపునిచ్చారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, మారుతున్న సామాజిక పరిస్థితులు, విద్యార్థుల ప్రవర్తనపై కీలక వ్యాఖ్యలు చేశారు.

- మిగతా 2వ పేజీలో



2లో

## ఎస్సీ, ఎస్టీల రక్షణకు పటిష్ఠ వ్యవస్థ.. సీఎం చంద్రబాబు సమీక్ష

- ఎస్సీ, ఎస్టీల రక్షణ, సంక్షేమంపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- అట్రాసిటీ నిరోధక చట్టం అమలుపై నాలుగంచెల కార్యాచరణ ప్రణాళిక
- ఈ ఏడాది నమోదైన 810 కేసులన్నీ పరిష్కరించామని వెల్లడి
- 2023 నుంచి బాధితులకు రూ. 15.43 కోట్ల పరిహారం అందజేత
- రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలో విజిలెన్స్ కమిటీల ఏర్పాటు



## 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు

- విజయవాడలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం
- హాజరైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- ఏపీలో విద్యావ్యవస్థను దేశంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని వెల్లడి
- వచ్చే ఏడాది ఏప్రిల్ లోపు వర్సిటీల్లో ఫ్యాకల్టీ నియామకాలు పూర్తి
- వివాదాస్పద జీవో 117 రద్దు, పారదర్శక బదిలీలతో ఉపాధ్యాయులకు న్యాయం

2లో

## రాష్ట్రంలో జాబ్ కేలండర్ లేదు..

# స్కాం కేలండర్ నడుస్తోంది

- మోదీని వణికించిన యువతకు రేవంత్ ఓ లెక్కా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం
- యువతతో పెట్టుకుంటే పెద్దపెద్ద వాళ్లే దిగిపోయారు.
- కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చింది
- తెలంగాణ సాధించిన కేసీఆర్ రాజీనామా చేయాలా? అని నిలదీత



సిరిసిల్ల: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్నే వణికించిన యువతకు తెలంగాణ సీఎం ఓ లెక్క కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. కరీంనగర్‌లో శనివారం నిర్వహించిన 'యువ సమరభేరి' సభలో కేటీఆర్ మాట్లాడారు. ఉడుకు నెత్తు రు ఉరకలెత్తితే పోరాటం పోటెత్తుతుందని, యువతతో పెట్టుకుంటే పెద్దపెద్ద వాళ్లే దిగిపోయారన్నారు. కష్టపడి సాధించుకు న్న తెలంగాణను పదేళ్లపాటు అభివృద్ధి పథంలో నడిపించా మని పేర్కొన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.

- మిగతా 2వ పేజీలో



## మరో ఇద్దరు మృత్యుంజయులు

- నేపాల్‌లో 60 ఏళ్ల వృద్ధురాలు, చైనా జాతీయుడిని రక్షించిన అధికారులు
- కొనసాగుతున్న గాలింపు, సహాయక చర్యలు
- 589 మంది విదేశీయులు సహా 5,000 మంది మిస్సింగ్

2లో



## అది విద్యా వ్యవస్థా లేక కార్పొరేట్ దోపిడీ వ్యవస్థ?

- ప్రైవేట్ స్కూళ్లు విచ్చలవిడిగా దోచుకుంటున్నాయని కవిత ఆగ్రహం
- స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపాటు
- విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా రేవంత్ మౌనం వహిస్తున్నారన్న కవిత

# పిల్లల బాల్యాన్ని కాపాడాలి



- డ్రగ్స్ వ్యసనం నుంచి దూరం చేయాలి
- క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలతో విద్యార్థుల్లో స్క్రీన్ టైమ్ తగ్గించాలి
- ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రధాని మోదీ పిలుపు

2లో



## ఉక్రెయిన్‌పై 3 రోజులు దాడులు బంద్

- ఉక్రెయిన్‌పై దాడులను మూడు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు రష్యా ప్రకటన
- సైన్యానికి ఆదేశాలు ఇచ్చిన అధ్యక్షుడు పుతిన్
- అమెరికా దౌత్యవేత్తలతో జరగనున్న శాంతి చర్చల నేపథ్యంలో ఈ నిర్ణయం
- చర్చల సమయంలో దాడులు వద్దని జెలెన్స్కీ ప్రతిపాదన

# రూ. 70 వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్

హైదరాబాద్: తెలంగాణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మౌలిక సదుపాయాల రంగానికి ఊతమిచ్చేలా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ రూ.70 వేల కోట్ల పెట్టుబడితో భారీ ప్రాజెక్టును ప్రకటించింది. ఈ ప్రాజెక్టు కోసం హైపర్‌వాల్ట్, దాని భాగస్వామ్య సంస్థలు కలిపి దేశంలోనే అతిపెద్ద భారీ కేంద్రాన్ని ఏర్పాటుచేయనున్నట్లు వెల్లడించింది. ఈ కేంద్రం నిర్మాణాన్ని 18 నుంచి 24 నెలల్లో పూర్తి చేయనున్నట్లు చెప్పింది. ఈ మేరకు శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ సమక్షంలో టీసీఎస్ ఎండీ, సీఈవో కృతివాసన్-- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఫ్యూచర్ సిటీలో ఒక గిగావాట్ సామర్థ్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు సంస్థ 250 ఎకరాల భూమిని సేకరించింది. తెలంగాణలో ఈస్థాయిలో భారీ పెట్టుబడి రావడంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ. .'నా కల నెరవేరింది. ఫ్యూచర్ సిటీలో రూ. 70 వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు కానుండటం గర్వకారణం.

నేను టీసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్‌ను దావోస్‌లో కలిసి తెలంగాణలో భారీ పెట్టుబడి పెట్టాలని కోరాను. అప్పుడు ఆయన నవ్వుతూ సరేనన్నారు. ఇప్పుడు కార్యరూపం దాల్చింది. ఈ డేటా సెంటర్ ద్వారా 7000 మందికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే టాటా సంస్థ తరపున రాష్ట్రంలో 85 వేల మంది ఉద్యోగులు తెలంగాణలో పనిచేస్తున్నారు. కొత్తగా ఏడువేలతో అది 92 వేలకు చేరుతుంది. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు నిర్మిస్తున్న మొత్తం 50 కి.మీ. రహదారికి భారతరత్న రతన్‌టాటా పేరు పెడుతున్నాం. 2034 నాటికి ఒక ట్రిలియన్ ఎకానమీగా తెలంగాణను నిలపాలన్న స్వప్నం సాకారం కావాలంటే ఫారరీచ్యన్ 500 కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలి. 2047 నాటికి మూడు ట్రిలియన్ ఎకానమీని సాధించాలి. దేశ జనాభాలో 2.5 శాతం ఉన్న తెలంగాణ ఇప్పుడు దేశానికి 5 శాతం జీడీపీని అందిస్తోంది. దానిని పది శాతానికి పెంచాలన్నది నా తాపత్రయం. ప్రపంచ ఏఐ విప్లవంలో హైదరాబాద్ ఇప్పుడు ముందు వరసలో నిలిచింది'అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ పార్టీల మధ్య విధానాల్లో భిన్నాభిప్రాయాల్లో ఉండవచ్చు కానీ, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి విషయంలో మాత్రం అలాంటివేమీ ఉండవని స్పష్టం చేశారు.

ఏఐతో ఉద్యోగాలు పోతాయన్న భావన ఉందని, ఇందులో ఇంజనీరింగ్ టెకీలకు తాను ఎలాంటి గ్యారంటీ ఇవ్వలేనని, కానీ బ్లూకాలర్ జాబ్స్ వాళ్లకు మాత్రం ఉద్యోగాలకు ఎలాంటి ఢోకా లేదని రేవంత్‌రెడ్డి చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని ప్రారంభించిన ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడుల వెల్లువ ప్రారంభమైందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు చెపప్పారు. తాము కేవలం మాటలు చెప్పడం లేదని. పెట్టుబడుల రాక నిజమని వ్యాఖ్యానించారు. టీసీఎస్ ఆతిథ్య, పర్యాటక, పరిశ్రమలు, సేవారంగం,అటవీ రంగాల్లో పెట్టుబుడులు పెడుతోందన్నారు.

తెలంగాణవైపు దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి చూస్తున్నాయన్నారు. తెలంగాణతో ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నామని టీసీఎస్ ఎండీ, సీఈవో కె.కృతివాసన్, చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న మద్దతు, ప్రతిపాదించిన పెట్టుబడులపై ఇస్తున్న సహకారానికి హైపర్‌వాల్ట్ ప్రెసిడెంట్ రాజన్న, సీఈఓ దీపేష్ కిరణ్ నందాలు కృతజ్ఞతలు తెలిపారు. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు.

# కేసీఆర్ అసెంబ్లీకి రా.. లేదంటే రాజీనామా చెయ్..

నకిరేకల్: 'మీదంతా గతమే బిడ్డా.. రాసిపెట్టుకో.. మీకు భవిష్యత్తు లేదు. మీ బతుకులు చీకటిమయమే.. రేవంత్‌రెడ్డి ఉన్నంతకాలం.. కార్యకర్తలు అండగా నిలిచినంత కాలం బీఆర్ఎస్ అనే మాటనే ఎత్తనివ్వం. తెలంగాణ తులసి వనంలో బీఆర్ఎస్ గంజాయి మొక్కను పీకుతాం'అని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వచ్చేసారి సిరిసిల్ల, సిద్దిపేటలో కూడా కాంగ్రెస్ గెలుస్తుందన్నారు. ఈ నెలాఖరుకు సిరిసిల్లకు వచ్చి ఆ గడ్డపై మూడు రంగుల జెండా ఎగురవేస్తానన్నారు. వచ్చే నెల్లో సిద్దిపేటపై దండయాత్ర చేస్తామన్నారు.

బావబామ్మర్దులు ఎవరిని తెచ్చుకుంటారో తెచ్చుకోవాలని, సిరిసిల్ల, సిద్దిపేటలో తేల్చుకుందామని, కల్వకుంట్ల కుటుంబం కాసుకోవాలన్నారు. రేవంత్‌రెడ్డి శనివారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో ఏరియా ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వేయి రోజుల ప్రజా పాలన ప్రగతి సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. సీట్లు పెరిగితే 117, ఉన్న సీట్లే ఉంటే 90 సీట్లతో మళ్లీ 2029లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తంచేశారు. వచ్చే పదేళ్లు తమ ప్రభుత్వమే ఉంటుందని, 2024 నుంచి 2034 వరకు రెండు సార్లు ఇందిరమ్మ రాజ్యం, కాంగ్రెస్‌పాలన ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేసీఆర్ అసెంబ్లీకి రా.. లేదంటే గౌరవంగా రాజీనామా చెయ్.. గజ్వేల్‌లో తేల్చుకుందాం..'అని పేర్కొన్నారు. 'ఏ ప్రభుత్వంలోనైనా 365 రోజులు ఉద్యోగానికి రాకపోతే ఉద్యోగస్తులను తొలగిస్తారు. వెయ్యి రోజులు ప్రతిపక్ష నాయకుడిగా రూ.22,24,40,000 జీత భత్యాలు, తిరగడానికి బండి, ఉండడానికి ఇల్లు, అన్ని వసతులు తీసుకున్న కేసీఆర్ ఒక్క రోజు కూడా బయటకు రాలేదు. డిస్మిస్ చేయాలా వద్దా? ఆలోచించండి.

కేసీఆర్ తీసుకున్న జీతం పేద ప్రజలు కట్టిన పన్నులు కాదా? ఎవడబ్బ సొమ్మని పందికొక్కులా మెక్కి ఫామ్‌హౌస్‌లో పడుకున్న మొనగాడు వస్తుండట, తెలంగాణను ఉద్ధరిస్తడట'అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షనేత, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

తనకు చదువు రాదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ తనకు చదువు వస్తదో రాదో కానీ సంస్కారం ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తనకు సంస్కారం లేకపోతే ఒక్కడు కూడా రోడ్డు మీద కాలు పెట్టరని, ఫామ్‌హౌస్‌లో పడుకోవాలన్నారు. సంస్కారం ఉంది కాబట్టే సీతక్క, కొండా సురేఖను ఇంట్లోకి పిలిచి రాఖీ కట్టించుకున్నానని, అదే తన సంస్కారమన్నారు. సంస్కారం లేని కేటీఆర్ ఆస్తి కోసం సొంత చెల్లిని మెడ పట్టి బయటకు నెట్టిన దుర్మార్గుడని.. తనకు, కేటీఆర్‌కు పోలికేంటన్నారు. ప్రజలను మోసం చేసి కొడుకు, అల్లుడు, బిడ్డ, చుట్టాలను బందిపోట్ల ముఠాను మొత్తం తీసుకొచ్చి దోచుకుతిన్నారన్నారు. కేసీఆర్ బిడ్డ జైలు నుంచి దుఃఖంతో ఇంటికిపోతే, ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని కేటీఆర్ ఇంట్లో నుంచి బయటకు గెంటేసిన దుర్మార్గుడని రేవంత్‌రెడ్డి అన్నారు. సొంత చెల్లికి అన్నం పెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తాడా..

## ఉక్రెయిన్‌పై 3 రోజులు దాడులు బంద్

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్‌పై దాడులను మూడు రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేయాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తన సైన్యాన్ని ఆదేశించారు. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఈ యుద్ధానికి ముగింపు పలికే దిశగా అమెరికా దౌత్యవేత్తలతో జరగనున్న చర్చలకు ముందు పుతిన్ ఈ నిర్ణయం తీసుకోవడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయాన్ని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ అధికారికంగా ప్రకటించారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా దౌత్యవేత్తల బృందం మాస్కోకు రానున్న నేపథ్యంలో పుతిన్ ఈ ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు. ఈ మూడు రోజుల వ్యవధిలో రాజధాని కీవ్‌తో సహా ఉక్రెయిన్‌లోని ఏ నగరంపైనా దాడులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఒక రోజు ముందే ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ ఒక కీలక ప్రతిపాదన చేశారు. శాంతి చర్చల సమయంలో ఇరుపక్షాలూ వైమానిక దాడులను నిలిపివేయాలని ఆయన కోరారు. తాము దాడులు చేయబోమని, రష్యా నుంచి కూడా అదే ఆశిస్తున్నామని పేర్కొన్నారు. యుద్ధాన్ని ముగించడానికి వాస్తవిక మార్గాలను అన్వేషిస్తున్నామని, అమెరికా దౌత్యవేత్తలు ఎలాంటి ప్రతిపాదనలు తీసుకువస్తారో చూడాలని ఆయన వ్యాఖ్యానించారు. జెలెన్స్కీ చేసిన ఈ ప్రతిపాదనకు స్పందనగానే రష్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## మరో ఇద్దరు మృత్యుంజయులు

కత్మాండు: నేపాల్‌లో మరో అద్భుతం చోటుచేసుకుంది. వరదల్లో చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులు మృత్యువు నుంచి తప్పించుకున్నారు. నువాకోట్ జిల్లా బిదుర్ పట్టణంలో ఆకస్మిక వరదల వల్ల కుప్పకూలిన నాలుగు అంతస్తుల భవన శిథిలాల కింద చిక్కుకుపోయిన 60 ఏళ్ల వృద్ధురాలు చండికా శ్రేష్ఠ 10 రోజుల తర్వాత సజీవంగా బయటపడింది. సహాయక సిబ్బంది బురద, ఒండ్రు మట్టిని తొలగించి ఆమెను శనివారం క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. నేపాల్ పోలీసులు ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆ మహిళ నెమ్మదిగా స్పృహలోకి రావడం వీడియోలో కనిపిస్తోంది. సహాయక సిబ్బంది ఆమెను దుప్పటి, జాకెట్‌తో కప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఈ వృద్ధురాలిని చికిత్స కోసం వెంటనే హెలికాప్టర్‌లో కత్మాండు ఆసుపత్రికి తరలించారు. రసువా జిల్లాలో భారీ వరదల ధాటికి ధ్వంసమైన అప్పర్ త్రిశూలి 1 జలవిద్యుత్ ప్రాజెక్ట్ సొరంగం నుంచి ఒక చైనా జాతీయుడిని శనివారం రక్షించారు. అతడిని లూహైటతావోగా గుర్తించారు. వరదల సమయంలో 'ఆడిట్ టన్నెల్ 4'లో చిక్కుకుపోయాడు. లూహైతావోను నేపాలీ సైన్యం, విదేశీ సహాయక సిబ్బందితో కూడిన బృందం కాపాడినట్లు అధికారులు ప్రకటించారు. సొరంగ మార్గంలో సుమారు 225 మీటర్ల లోపల ఉన్న ఒక ప్రదేశం నుంచి సజీవంగా బయటకు తీసుకొచ్చినట్లు చెప్పారు.

## పిల్లల బాల్యాన్ని కాపాడాలి

న్యూఢిల్లీ: విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వ్యసనం పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. పిల్లలను క్రీడలు, శారీరక వ్యాయామం, సృజనాత్మక కార్యకలాపాల వైపు ప్రోత్సహించాలని, తద్వారా వారు సెల్‌ఫోన్లతో ఎక్కువ సమయం వృథా చేయకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా.. ఉత్తమ ఉపాధ్యాయులుగా జాతీయ అవార్డుకు ఎంపికైన వారితో ప్రధాని మోదీ ఢిల్లీలోని తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ వీడియోను ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ఉత్తమ ఉపాధ్యాయులతో ప్రధానమంత్రి సంభాషించారు. పిల్లల బాల్యాన్ని కాపాడాలని, వారిలో సహజ కుతూహలాన్ని పెంపొందించాలని చెప్పారు. తరగతి గది అభ్యాసాన్ని మరింత ఆసక్తికరంగా మార్చడానికి సృజనాత్మక పద్ధతులను ఎంచుకోవాలని అన్నారు. చదువులు మాత్రమే కాకుండా పిల్లల ప్రవర్తన, దైనందిన జీవితం పట్ల కూడా శ్రద్ధ వహించాలని స్పష్టంచేశారు. ఆధునిక యుగంలో ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్న తరుణంలో విద్యార్థుల జీవితాల్లో టీచర్లు మరింత కీలక పాత్ర పోషించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. వారికి సరైన మార్గనిర్దేశం చేస్తూ ఉజ్వల భవిష్యత్తు వైపు ముందుకు నడిపించాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. విద్యార్థుల్లోనూ డ్రగ్స్ వ్యసనం పెరిగిపోతుండడం పట్ల ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. పెద్ద నగరాలు, విశ్వవిద్యాలయాల్లో ఎవరు ఎవరికి ఏమి ఇస్తున్నారో తెలియడం లేదని, దీనివల్ల డ్రగ్స్ బారిన పడిన వారిని గుర్తించడం కష్టమని అన్నారు.

## రాష్ట్రంలో జాబ్ కేలండర్ లేదు..,స్కాం కేలండర్ నడుస్తోంది

ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, యూత్ కమిషన్, ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్, యువతకు రూ.10లక్షల రుణాలు, రూ.4వేల నిరు ద్యోగభృతి, కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో జాబ్ కేలండర్ లేదని, స్కాం కేలండర్ నడుస్తోందని విమర్శించారు. నోటిఫికేషన్ లేకపోయినా లూటిఫికేషన్ కొనసాగుతోందన్నారు. నిరుద్యోగుల సమస్యలను ప్రశ్నిస్తే బూతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హామీలను అమలు చేయలేని రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాధించిన కేసీఆర్ రాజీనామా చేయాలా? అని కేటీఆర్ ప్రశ్నించారు. అశోక్‌నగర్‌లో ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన రాహుల్‌గాంధీ.. ఓట్లు వేయించుకున్న తర్వాత తెలంగాణకు అడ్రస్ లేకుండా పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దండం పెట్టి ఓట్లు వేసిన ఉద్యోగులే కాంగ్రెస్‌కు పిండం పెడతారన్నారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల భూములు,

ఆస్తులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కన్నేసిందని కేటీఆర్ ఆరోపించారు. పాలిటెక్నిక్ కళాశాలలను కార్మిక శాఖ పరిధిలోకి తెచ్చేందుకు ఉద్దేశించిన జీవో 97ను రద్దు చేసే వరకు బీఆర్ఎస్ విద్యార్థుల వెంట ఉండి పోరాడుతుందని స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అగ్రహారంలోని పాలిటెక్నిక్ కాలేజీలో 20 రోజులుగా ఆందోళన చేస్తున్న విద్యార్థులను కలిసిన కేటీఆర్ వారి సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌తోపాటు సిరిసిల్ల, కరీంనగర్ తదితర పట్టణ ప్రాంతాల్లో విలువైన భూముల్లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల ఆస్తులపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆరోపించారు. తాను సిరిసిల్ల ఎమ్మెల్యేగా, మాజీ మంత్రిగా, ఈ జిల్లా బిడ్డగా విద్యార్థులకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.

## 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు

ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యవస్థను దేశంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని, అందుకోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 2029లోగా మరో మూడు మెగా డీఎస్సీలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో శనివారం జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మెగా డీఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం చేశారని, ఇచ్చిన మాటకు కట్టుబడి 16,000 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని తెలిపారు. "సీబీఎన్ అంటే డీఎస్సీ, డీఎస్సీ అంటే సీబీఎన్" అని అభివర్ణించిన లోకేశ్, చంద్రబాబు నాయకత్వంలో

గతంలో 14 డీఎస్సీల ద్వారా సుమారు రెండు లక్షల మంది ఉపాధ్యాయులను నియమించిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. పని చేసేవాళ్లకే రాళ్ల దెబ్బలు తగులుతాయని, ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు తనపై విమర్శలు చేస్తున్నా పట్టించుకోనని అన్నారు. "ఓటమిని అంగీకరించడం అనేది నా డిక్షనరీలో లేదు. చిన్న చిన్న స్పీడ్ బ్రేకర్లు వస్తుంటాయి. కానీ నా లక్ష్యం ఒక్కటే.. అంగన్‌వాడీ నుంచి పీజీ వరకు 'ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్'ను ప్రపంచంలోనే నెంబర్ వన్ చేయడం" అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న యూనివర్సిటీ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీపైనా మంత్రి కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ప్రొఫెసర్లు,

అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేసి, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు కొత్త జవసత్వాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

## విద్యార్థుల తీరుపై చంద్రబాబు ఆవేదన..

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక మాధ్యమాల ప్రభావంతో విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలవుతున్నారని, మానసిక బలహీనతతో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని చంద్రబాబు అన్నారు. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల్లో జరిగిన కొన్ని ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులు ప్రిన్సిపల్‌ను హత్య చేయడం, విజయనగరంలో ఓ బాలుడు కన్నతల్లినే చంపడం, విశాఖలో టీచర్ కొట్టిన దెబ్బకు ఆరేళ్ల చిన్నారి షాక్‌తో ప్రాణాలు విడవడం వంటి ఘటనలు తనను కలచివేశాయని తెలిపారు. గతంలో ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ చూడలేదని, ఈ పరిస్థితులను అధిగమించేందుకు విద్యార్థులకు యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక చింతన వంటివి అలవాటు చేయాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా ఉపాధ్యాయుల స్థానాన్ని ఏదీ భర్తీ చేయలేదని చంద్రబాబు స్పష్టం చేశారు. టీచర్ వద్ద లేని సమాధానం ఏఐ కూడా చెప్పలేదని అన్నారు. విద్యార్థులను భవిష్యత్ ప్రపంచానికి సిద్ధం చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని, వారిని కేవలం పాఠాలకే పరిమితం చేయకుండా విలువలు, సంస్కృతి, దేశభక్తి, ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించాలని కోరారు. ప్రతి పాఠశాలకు ఒక ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని, దేశానికే "ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్" ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. 2027 నాటికి రాష్ట్రంలో 100 శాతం అక్షరాస్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం పునరుద్ఘాటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకం మెగా డీఎస్సీపైనే చేసిందని, వైసీపీ నేతలు 350కి పైగా పిటిషన్లు వేసి అడ్డుకోవాలని చూసినా వాటన్నింటినీ అధిగమించి నియామకాలు చేపట్టామని గుర్తుచేశారు. ఉపాధ్యాయులకు గౌరవం ఇస్తూ, వారి ప్రతిభకే పెద్దపీట వేసేలా పారదర్శక కౌన్సెలింగ్ విధానాన్ని చట్టబద్ధం చేశామని వివరించారు. గత ప్రభుత్వంలా కాకుండా, తాము ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సముచిత గౌరవం ఇస్తామని, వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని భరోసా ఇచ్చారు.

## అది విద్యా వ్యవస్థా లేక కార్పొరేట్ దోపిడీ వ్యవస్థా?

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా సాగుతున్న ఫీజుల దోపిడీపై కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ ఫీ రెగ్యులేటరీ కమిషన్‌ను తీసుకొస్తామని గతంలో ఇచ్చిన హామీ ఏమైందని, దానికి సంబంధించిన డ్రాఫ్ట్ బిల్లు రెండేళ్లుగా కేబినెట్ దాటి బయటకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. స్వయంగా విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి... పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. ప్రభుత్వ భూముల్లో నడిచే హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సైతం ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచినా సర్కార్ మౌనంగా ఉండటం కార్పొరేట్ విద్యా వ్యాపారులకు బాసటగా నిలవడమేనని కవిత ఆరోపించారు.

## ఎస్సీ, ఎస్టీల రక్షణకు పటిష్ఠ వ్యవస్థ.. సీఎం చంద్రబాబు సమీక్ష

రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) రక్షణ, సంక్షేమం, అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం అమలును పటిష్ఠంగా పర్యవేక్షించేందుకు రూపొందించిన నాలుగంచెల కార్యాచరణ ప్రణాళికపై అధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరించారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం ఈ సమావేశం జరిగింది. ఎస్సీ, ఎస్టీ వర్గాల రక్షణ, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యాచరణను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా 'ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ సెల్' ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనితో పాటు రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిల్లో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి, చట్టం అమలు తీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. 2026 సంవత్సరంలో ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద 810 కేసులు నమోదు కాగా, వాటన్నింటినీ పరిష్కరించినట్లు అధికారులు సమావేశంలో వెల్లడించారు. ఈ కేసుల విచారణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రత్యేక సెషన్స్ కోర్టులు,

ఒక ప్రత్యేక కోర్టు పనిచేస్తున్నాయని తెలిపారు. 2023 నుంచి 2026 ఆగస్టు వరకు 1,478 కేసుల్లో బాధితులకు రూ. 15.43 కోట్ల పరిహారాన్ని అందించినట్లు వివరించారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రులు డీబీవీ స్వామి, వి. అనిత, జి. సంధ్యారాణి, ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల ఎంపీలు కృష్ణప్రసాద్, దగ్గుమళ్ల ప్రసాద్, పలువురు ఎమ్మెల్యేలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజీత్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యనార్, న్యాయశాఖ అధికారులు హాజరయ్యారు.

# రైతులకు మళ్లీ మొదలైన కరెంటు కష్టాలు

- రోజుకు రూ.2 వేలతో జనరేటర్ ద్వారా పొలానికి నీరు
- వరి పొట్ట దశకు చేరడంతో తప్పని తిప్పలు
- సమయానికి త్రీఫేజ్ విద్యుత్ అందక రైతుల అవస్థలు
- విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందన లేదంటూ ఆవేదన
- ఏఈ తీరుపై రైతుల అసంతృప్తి.. సమస్య పరిష్కరించాలని డిమాండ్



తొలివెలుగు, ఆత్మకూర్(ఎం) : వ్యవసాయానికి అవసరమైన సమయంలో త్రీఫేజ్ విద్యుత్ అందక రైతులకు మళ్లీ కరెంటు కష్టాలు మొదలయ్యాయి. పంటలు కీలక దశకు చేరుకోవడంతో పొలాలకు నీరు అందించేందుకు రైతులు అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని తుక్కాపురం గ్రామానికి చెందిన రైతు సుడి మహేందర్‌రెడ్డి తనకున్న నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశకు చేరుకోవడంతో పొలానికి నిరంతరం నీరు అవసరమవుతోంది. అయితే సమయానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కాకపోవడంతో రోజుకు రూ.2 వేల వరకు ఖర్చు చేసి జనరేటర్ ద్వారా పొలానికి నీరు అందిస్తున్నట్లు రైతు తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరిగి సమస్యను వివరించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తనతో విద్యుత్ ఏఈ ప్రవీణ్‌కుమార్ దురుసుగా మాట్లాడారని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలపై మండలంలోని పలువురు రైతులు అధికారులను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ సరైన స్పందన రావడం లేదని రైతులు ఆరోపించారు. సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు రైతులతో మర్యాదగా వ్యవహరించి, వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా అందించాలని వారు కోరుతున్నారు. వరి పంట కీలక దశలో ఉన్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలను వెంటనే తొలగించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# గురువే విద్యార్థి భవిష్యత్తుకు బలమైన పునాది

- నెమిల ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు
- అక్షరాలు నేర్పి ఆలోచనలను మలిచే శిల్పి గురువు: మేక వెంకటేశ్వర్‌రెడ్డి
- సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు చిరస్మరణీయం
- ఆటపాటలతో ఆకట్టుకున్న విద్యార్థులు
- విద్యార్థులకు బహుమతులు, స్వీట్లు పంపిణీ



తొలివెలుగు, రాజాపేట : అక్షరాలను నేర్పి ఆలోచనలను మలిచే శిల్పి గురువేనని తెలంగాణ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య కమిటీ చైర్మన్ మేక వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం నెమిల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేక వెంకటేశ్వర్‌రెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. గురువు లేని విద్య శూన్యమని, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ఉపాధ్యాయులేనని అన్నారు. అజ్ఞానం అనే చీకటి నుంచి జ్ఞానం అనే వెలుగులోకి తీసుకెళ్లే మార్గదర్శి గురువని పేర్కొన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదని, ప్రతి ఒక్కరూ కేవలం డాక్టర్లు, ఇంజనీర్లు కావాలనే ఆలోచనతో కాకుండా వ్యవసాయ రంగం ప్రాధాన్యతను కూడా గుర్తించాలని సూచించారు. విద్యార్థులు శ్రద్ధ, భక్తితో విద్యను అభ్యసించి మంచి ఆలోచనలతో భవిష్యత్తును నిర్మించుకోవాలని అన్నారు. పిల్లలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఎదిగి దేశానికి వెన్నెముకగా నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నమిల భరత్‌కుమార్ మాట్లాడుతూ పలక, బలపం చేతికిచ్చి విద్యార్థుల జీవితానికి బాటలు వేసేది ఉపాధ్యాయుడేనని అన్నారు. విద్యారంగానికి, సమాజానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను ప్రతిబింబించేలా ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కందుల మమత, మంత్రి నగేష్, మేక సాయిప్రియ, రజిత తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచుల అక్రమ అరెస్టులు ఆపాలి

- బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలి: గుంటి మధుసూదన్‌రెడ్డి
- పెండింగ్ బిల్లులతో మాజీ సర్పంచులు, చిన్న కాంట్రాక్టర్లకు ఇబ్బందులు




తొలివెలుగు, రాజాపేట : బకాయి బిల్లులు చెల్లించకుండా మాజీ సర్పంచులను అక్రమంగా అరెస్టు చేస్తూ ఇబ్బందులకు గురిచేయడం సరికాదని తెలంగాణ రాష్ట్ర మాజీ సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మాజీ సర్పంచులు, చిన్న కాంట్రాక్టర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాజాపేటలో విలేకరులతో మాట్లాడిన మధుసూదన్‌రెడ్డి.. ముఖ్యమంత్రి ఉమ్మడి నల్గొండ జిల్లా, నకిరేకల్ నియోజకవర్గ పర్యటన సందర్భంగా పలువురు మాజీ సర్పంచులను పోలీసులు అరెస్టు చేసి సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లోని పోలీస్ స్టేషన్లకు తరలించారని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలు సరికావని అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టిన మాజీ సర్పంచులు, చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా వారిని మరింత ఇబ్బందులకు గురిచేయడం వల్ల వారి కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మాజీ సర్పంచులు, చిన్న కాంట్రాక్టర్లకు సంబంధించిన బకాయి బిల్లులను విడుదల చేయాలని, అరెస్టులు, నిర్బంధాల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ‘చలో హైదరాబాద్’ను విజయవంతం చేయాలి

- రాజాపేట మండలంలో ఉద్యోగ సంఘాల ప్రచారం.. పోస్టర్ ఆవిష్కరణ
- సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో ఉద్యోగుల హక్కుల సాధన సభ
- పెద్ద సంఖ్యలో ఉద్యోగులు తరలిరావాలని పిలుపు
- సంఘాలకు అతీతంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి
- పోస్టర్ ఆవిష్కరించి నినాదాలు చేసిన ఉద్యోగ సంఘాల నాయకులు



తొలివెలుగు, రాజాపేట : ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ‘చలో హైదరాబాద్-ఉద్యోగుల హక్కుల సాధన సభ’ ను విజయవంతం చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. టీజీజేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, టీజీజేఏసీ సెక్రటరీ జనరల్ ధరణికోట భగత్ ఆదేశాల మేరకు చేపట్టిన జిల్లా ప్రచార పర్యటనలో భాగంగా శనివారం రాజాపేట మండలంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజాపేట మండల తహసీల్దార్ గోలి రవికిరణ్ మాట్లాడుతూ.. ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం టీజీజేఏసీ చేస్తున్న పోరాటానికి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఉద్యమానికి సహకరించడం ప్రతి ఉద్యోగి కనీస బాధ్యత అని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. రాజాపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి కీతల నాగమణి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 10న నిర్వహించే ‘చలో హైదరాబాద్’ కార్యక్రమంలో రాజాపేట మండలం నుంచి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పెన్షనర్లు సంఘాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని, తమ హక్కుల సాధన కోసం నిర్వహించే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించి ‘చలో హైదరాబాద్’ కార్యక్రమానికి మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీజీజేఏసీ జిల్లా కో-చైర్మన్ పెండెం శ్రీనివాస్, జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ గణగాని శశికాంత్‌గౌడ్, రాజాపేట మండల జేఏసీ ఇన్‌చార్జి దండే లక్ష్మణ్, ఎంపీవో ఆవుల కిషన్, ఏపీఎం మురహరి, ఆలేరు యూనిట్ అధ్యక్షులు పోలా గురునాథ్, నల్లవెల్లి సునీల్‌కుమార్, టీఎన్‌జీవో నాయకులు కేంసారం ఆనంద్, నాగసైదులు, ఆలేరు ఈసీ కర్నాకర్, రాపోలు మధుసూదన్, రాపోలు రామచంద్రరెడ్డి తదితరులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి సర్పంచి భాస్కర్ చేయూత

- అనారోగ్యంతో వాటర్‌మ్యాన్ మేడి మల్లయ్య మృతి.. రూ.5 వేల ఆర్థిక సాయం
- కుటుంబ సభ్యులకు పరామర్శించి ఆర్థిక భరోసా
- బాధిత కుటుంబానికి అండగా నిలిచిన సర్పంచి
- సాయం అందించిన సర్పంచి బొడ్డు భాస్కర్

తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండలం కుర్రారం గ్రామానికి చెందిన వాటర్‌మ్యాన్ మేడి మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుర్రారం సర్పంచి బొడ్డు భాస్కర్ శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి భాస్కర్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి తనవంతు సహాయం అందించామని, కష్టకాలంలో వారికి అండగా ఉంటామని తెలిపారు. మల్లయ్య మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచి రావికొండల్‌రెడ్డి, ఎర్రగుంట ప్రభాకర్, మేడి శ్రీనివాసులు, బసవయ్యగౌడ్, బసవరాజుగౌడ్, కత్తుల అంజిరెడ్డి, పాండవుల లింగయ్య, ఎర్రగుంట బాలనరసయ్య, మేడి ఆనంద్, వల్లూరి మహేందర్, ఎర్రగుంట సుదర్శన్, ఊట్కూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ సంఘానికి డప్పులు పంపిణీ

- సంఘ సభ్యులకు సర్పంచ్ ఎమ్మ శిరీష నాగరాజు చేయూత
- నర్సాపురంలో కార్యక్రమం
- అంబేద్కర్ సంఘం సభ్యులకు డప్పులు అందజేత
- సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగపడనున్న డప్పులు
- సర్పంచ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన సంఘం సభ్యులు




తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండలం నర్సాపురం గ్రామంలో అంబేద్కర్ సంఘం సభ్యులకు గ్రామ సర్పంచ్ ఎమ్మ శిరీష నాగరాజు శనివారం డప్పులను పంపిణీ చేశారు. గ్రామంలోని అంబేద్కర్ సంఘం సభ్యుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని డప్పులను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎమ్మ శిరీష నాగరాజు మాట్లాడుతూ.. గ్రామంలో సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంలో సంఘాలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. గ్రామ ప్రజల ఐక్యత, సామాజిక చైతన్యానికి దోహదపడే కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. సంఘ సభ్యులు సమష్టిగా పనిచేస్తూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. అంబేద్కర్ సంఘం సభ్యులు మాట్లాడుతూ తమ అవసరాన్ని గుర్తించి డప్పులను అందజేసిన సర్పంచ్ ఎమ్మ శిరీష నాగరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో సామాజిక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఈ డప్పులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన కార్యక్రమాలకు సహకరిస్తూ, వివిధ సంఘాలకు ప్రోత్సాహం అందించడం అభినందనీయమని పలువురు తెలిపారు. సర్పంచ్ అందించిన సహకారానికి సంఘం సభ్యులు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.

# మృతురాలి కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ చేయూత

- పులి చిన్న నర్సమ్మ కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత



తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండలం నెమిల గ్రామంలో ఇటీవల మృతి చెందిన పులి చిన్న నర్సమ్మ కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సహాయం అందించారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదేశాల మేరకు, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత సహకారంతో బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న పేద, నిరుపేద కుటుంబాలకు తమవంతు సహకారం అందించడమే లక్ష్యంగా బీర్ల ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకుల రూపంలో చేయూత అందించడం ద్వారా కొంతవరకు అండగా నిలిచే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ పరిస్థితిని గుర్తించి నిత్యావసర సరుకులు అందించినందుకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనితకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నెమిల సర్పంచ్ పులి రాజు ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు జెట్ట సిద్దులు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నకిరేకల్ సీఎం సభకు కదలిన ‘చిట్యాల’

- నకిరేకల్ ప్రజా విజయోత్సవ సభకు కదిలిన నాయకులు, కార్యకర్తలు
- ప్రభుత్వ సంక్షేమానికి ప్రజా ఆదరణే నిదర్శనం: కౌన్సిలర్ పరమేష్

తొలివెలుగు, చిట్యాల : నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో శనివారం నిర్వహించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు చిట్యాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ ఏర్పుల పరమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు వివిధ వాహనాల్లో నకిరేకల్‌కు పయనమయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఏర్పుల పరమేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సభకు ప్రజలు స్వచ్ఛందంగా, పెద్ద సంఖ్యలో తరలిరావడం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న సానుకూలతకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రాంతీయ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేశాయన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ జగిని బిక్షం రెడ్డి, నాయకులు ఆగు వెంకన్న, తోటకూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.





## కేసీఆర్ ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలి


- ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితం
- నేడు ఇందిరాపార్క్ వద్ద కాంగ్రెస్ 'మహా నిరసన'

తొలివెలుగు, ఎల్‌బీనగర్ : ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు తన పదవికి రాజీనామా చేయాలని, లేదంటే ఆయన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా, ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని ఆరోపించారు. టీపీసీసీ పిలుపు మేరకు ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఇందిరాపార్కు వద్ద నిర్వహించే 'మహా నిరసన' కార్యక్రమానికి ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి భారీగా తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. గడిచిన వెయ్యి రోజుల కాలంలో జీతం, భద్రత పేరుతో కేసీఆర్ కోసం రూ.22.24 కోట్ల ప్రజాధనం ఖర్చయిందని నాయకులు పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా బాధ్యతలను నిర్వర్తించని నాయకుడు ఎందుకని ప్రశ్నించారు. ఈ నిరసన ప్రదర్శనకు ఎల్బీనగర్ నుంచి నాయకులు, కార్యకర్తలు బైక్‌లు, కార్లతో ర్యాలీగా వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నేతలు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పేదల పళ్లెంలో సన్న అన్నం.. కాంగ్రెస్ మార్కు సంక్షేమం

- రేషన్ దుకాణాలు, బస్తీల్లో మధుయాష్కీ గౌడ్ పర్యటన
- లబ్ధిదారులతో నేరుగా మాటామంతీ.. సంక్షేమ పథకాలపై ఆరా

తొలివెలుగు, వనస్థలిపురం: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు అర్హులైన



ప్రతి పేద కుటుంబానికీ చేరుతున్నాయని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. ప్రజా పాలన 1000 రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం వనస్థలిపురంలోని పలు రేషన్ దుకాణాలు, బస్తీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సన్న బియ్యం పంపిణీ తీరును పరిశీలించి, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. ధనవంతులు తినే నాణ్యమైన సన్న బియ్యాన్ని పేదల పళ్లెంలో పెట్టాలన్నదే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 3.30 కోట్ల మందికి సన్న బియ్యం అందుతున్నట్లు చెప్పారు. గత పదేళ్లలో జరగని విధంగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు అర్హులైన కుటుంబ సభ్యుల పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చినట్లు పేర్కొన్నారు. అనంతరం గుంటి జంగయ్యనగర్ కాలనీలో పర్యటించిన ఆయన.. ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం వంటి ప్రభుత్వ పథకాల అమలుపై బస్తీవాసులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాశం అశోక్ గౌడ్, సత్యనారాయణ, కుట్ల నర్సింహా యాదవ్, మకుటం సదాశివుడు, కొల్లూరు శ్రీనాథ్, స్వర్ణ మాధవి పాల్గొన్నారు.



# ఫీజు బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

- తహసీల్దార్‌కు బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ, డీఎస్పీ నేతల వినతి
- 30 లక్షల మంది విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారింది
- రూ.14 వేల కోట్ల బకాయిలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు
- ప్రభుత్వం అత్యవసరంగా స్పందించాలి: బందెల అశోక్



తొలివెలుగు, రామన్నపేట : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి విద్యార్థుల చదువులకు భరోసా కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) రామన్నపేట మండల అధ్యక్షుడు బందెల అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ, డీఎస్పీ మండల కమిటీల ఆధ్వర్యంలో రామన్నపేట తహసీల్దార్ లాల్ బహదూర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బందెల అశోక్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన దాదాపు రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం బకాయిలను సకాలంలో విడుదల చేయకపోవడంతో ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యను కొనసాగించేందుకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాలల్లో విద్యార్థులపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతోందని, కొందరు విద్యార్థులు చదువులను మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థులకు విద్యను అందుబాటులో ఉంచడం ప్రభుత్వ బాధ్యత అని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. బకాయిల విడుదలలో మరింత జాప్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ మండల ఉపాధ్యక్షుడు మల్లేష్, కార్యదర్శి స్వామి, నాయకులు నరేందర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# గురువే సమాజ నిర్మాణ దిక్సూచి



- వివేకానందాస్ డివైన్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు
- ఉపాధ్యాయులకు ఘన సత్కారం.. ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



తొలివెలుగు, రామన్నపేట: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వివేకానందాస్ డివైన్ మోడల్ పాఠశాల వ్యవస్థాపకులు తిరగుడు మల్లికార్జున్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని పాఠశాలలో శనివారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెలిమినేటి మల్లేష్, ఉప ప్రధానోపాధ్యాయురాలు అస్మా, ఉపాధ్యాయులతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వ్యవస్థాపకులు తిరగుడు మల్లికార్జున్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తనను పెంపొందిస్తూ వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. అనంతరం విద్యార్థులు తమ గురువులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రసంగాలు, గేయాలాపనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, ముత్యాలు, స్వామి, సుధారాణి, కొండ సాయి, విజయ, జానకి, విద్యాసాగర్, సునీత, శాంతి, రాజేశ్వరి, సరిత, ఉమ తదితరులు పాల్గొన్నారు.

## దాడుల సంస్కృతి ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు

- ఆసుపత్రిలో నాగం శ్రీదేవిని పరామర్శించిన ఈఎల్వి అశోక్, బిజెపి నేతలు
- కోమటిరెడ్డి సోదరులను పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్

తొలివెలుగు, చౌటుప్పల్ : ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులపై భౌతిక దాడులకు తెగబడటం అత్యంత ప్రమాదకరమని, దాడుల సంస్కృతి ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు లాంటిదని ఈఎల్వి భాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ ఈఎల్వి అశోక్, బిజెపి నాయకులు పేర్కొన్నారు. నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో గాయపడి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నల్లగొండ జిల్లా బిజెపి అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి తల్లి నాగం శ్రీదేవిని వారు శనివారం పరామర్శించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజకీయంగా ఎదుర్కొలేక కాంగ్రెస్ నాయకులు పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. జిల్లాలో ప్రశ్నిస్తే దాడులు చేసే సంస్కృతిని పెంచి పోషిస్తున్న కోమటిరెడ్డి సోదరులను తక్షణమే వారి పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. భయాందోళనలు సృష్టించేందుకు యత్నిస్తే సహించేది లేదని, దాడికి బాధ్యులైన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి చౌటుప్పల్ పురపాలక ఫ్లోర్ లీడర్ బుడ్డ సురేష్, నారాయణపూర్ మండల ఉపాధ్యక్షుడు ఎలిజల శ్రీను, చౌటుప్పల్ పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శి తోకల సాయి, నాయకులు మార్గం శివ యాదవ్, గుండె మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంటి నిర్మాణం కూలి కూలీ దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు.. మల్లికార్జుననగర్‌లో విషాదం



తొలివెలుగు, వనస్థలిపురం: పాత ఇంటి పునరుద్ధరణ పనులు చేస్తుండగా నిర్మాణంలోని ఓ భాగం అకస్మాత్తుగా కూలిపడటంతో ఓ కూలీ దుర్మరణం చెందగా, మరో కూలీ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషాద ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లికార్జుననగర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లికార్జుననగర్‌లో పసునూరి అనంత ఆత్రేయకు చెందిన ఇంటి పునరుద్ధరణ పనుల్లో నలుగురు కూలీలు నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో ఇంటి నిర్మాణంలోని ఓ భాగం ఒక్కసారిగా కూలి కూలీలపై పడింది. ఈ ప్రమాదంలో కేశబోయిన సైదులు (48) తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని వనస్థలిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో కూలీ ప్రభాత్ గోర్లే (42)ను చికిత్స నిమిత్తం శ్రీకర ఆసుపత్రికి తరలించారు. పనుల్లో ఉన్న మరో ఇద్దరు కూలీలు లాజర్, రవిలు ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వనస్థలిపురం పోలీసులు తెలిపారు.



## భావిభారత నిర్మాతలకు బ్రహ్మరథం

- 'చిట్యాల'లో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు
- డాక్టర్ సర్వేపల్లికి ఘన నివాళి
- ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు

తొలివెలుగు, చిట్యాల : మండల వ్యాప్తంగా శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని గురువుల సేవలను స్మరించుకున్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పుతున్న గురువులకు పూలగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయుల సేవలను, వారి గొప్పతనాన్ని వివరిస్తూ ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమని, బోధనతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణను పెంపొందిస్తామని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో జరిగిన ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతన్నకు విద్యుత్ 'కోత'ల తిప్పలు

- రైతాంగానికి 18 గంటల కరెంటు ఇవ్వాలి
- వలిగొండ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ధర్నా



తొలివెలుగు, వలిగొండ : వ్యవసాయానికి విద్యుత్ కోతలను తక్షణమే అరికట్టి, గతంలో మాదిరిగానే 18 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. శనివారం వలిగొండ మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం వరి పంట పొట్టదశకు చేరుకుందని, ఈ సమయంలో విద్యుత్ సరఫరాను 18 గంటల నుంచి 8-12 గంటలకు తగ్గించడం వల్ల పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల ధాన్యం దిగుబడి తగ్గి రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో కేవలం 7 నుంచి 8 గంటలే విద్యుత్ ఇస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సరైన విద్యుత్‌ను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కొండే కిష్టయ్య, కలుకూరి రామచందర్, భీమనబోయిన జంగయ్య, పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, రైతు సంఘం నాయకులు మంగ బాలయ్య, కందగట్ల సాయి రెడ్డి, దయ్యాల మల్లేశం, చేగురి నరసింహ, కొండూరు సత్తయ్య, వట్టిపెల్లి చంద్రయ్య, ధ్యానబోయిన యాదగిరి, నారీ వెంకటేశం, పెద్దబోయిన భీమరాజు, దేశపాక రవి, నగేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- ఎంపియుపిఎస్ కాప్రా హెచ్ఎం బత్తుల శ్రీనివాస్ రెడ్డి
- కాప్రా పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

తొలివెలుగు, కాప్రా: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఎంపియుపిఎస్ కాప్రా హెచ్‌డబ్ల్యూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, నైతికత, వ్యక్తిత్వ వికాసాన్ని అందించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, రమ, రమ్య, వాసవి, రాఘవేందర్ గౌడ్, వేణుమాధవ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# వికాస సభకు ప్రజా ప్రవాహం

- నకిరేకల్ సభకు పోటెత్తిన రామన్నపేట కాంగ్రెస్ శ్రేణులు
- 60 వాహనాల్లో 8,500 మంది తరలింపు
- రేవంత్ రెడ్డి మార్కు పాలనకు జనం నీరాజనాలు: పున్న జగన్మోహన్



తొలివెలుగు, రామన్నపేట : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తెలంగాణ ప్రగతి పథంలో దూసుకుపోతోందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న జగన్మోహన్ అన్నారు. నకిరేకల్‌లో ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'వెయ్యి రోజుల ప్రజా పాలన వికాస సభ'కు రామన్నపేట మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మండలం నుంచి సుమారు 60 వాహనాల్లో 8,500 మంది ప్రతినిధులు సభకు హాజరైనట్లు జగన్మోహన్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నకిరేకల్‌లో 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం నియోజకవర్గానికి ఎంతో ప్రయోజనకరమన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, ఆ ఆర్థిక భారాన్ని అధిగమిస్తూనే ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తోందని చెప్పారు. రేవంత్ రెడ్డి నాయకత్వానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల బిక్షంరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరోద్దీన్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టే సంతోష్‌కుమార్, జిల్లా నాయకులు గంగుల వెంకట రాజారెడ్డి, పూస బాలకిషన్, సాల్వేరు అశోక్, జెల్ల వెంకటేష్, ఎండీ అక్రమ్, కోట సుధాకర్, ఎండీ నాసర్ తదితరులు పాల్గొన్నారు.

# భావి భారత పౌరులను తీర్చిదిద్దేది గురువులే



- వెల్లంకి పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

తొలివెలుగు, రామన్నపేట: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని వెల్లంకి పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్ఎం సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అన్నారు. విద్యార్థుల జీవితానికి సరైన దిశానిర్దేశం చేయడంలో గురువుల పాత్ర వెలలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, గేయాలాపనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తుడి మురళి, లింగయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఆదర్శనీయం.. విశ్రాంత ఉద్యోగుల సేవలు

- ఘనంగా సన్మానించిన శ్రీ వెంకటేశ్వర కాలనీ కమిటీ
- కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన

తొలివెలుగు, వలిగొండ : ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వలిగొండలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో విశ్రాంత ఉద్యోగులను కాలనీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కమిటీ గౌరవాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి, కాలనీ అధ్యక్షుడు భీమిడి యాదిరెడ్డి నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులను శాలువాలతో సత్కరించి, వారు ఉద్యోగ జీవితంలో అందించిన సేవలను వక్తలు కొనియాడారు. సమాజ అభివృద్ధికి విశ్రాంత ఉద్యోగులు తమ అనుభవాలను వినియోగిస్తూ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను కమిటీ సభ్యులు, స్థానికులతో కలిసి విశ్రాంత ఉద్యోగులు పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ ప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## ఉన్నత శిఖరాలకు చేర్చే దిక్సూచి.. గురువు

- చిన్నగూడూరులో వైభవంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు
- విద్యార్థులకు అక్షరజ్ఞానంతో పాటు మానవీయ విలువలు నేర్పించాలి

తొలివెలుగు, చిన్నగూడూరు : విద్యార్థులను విజయాల బాటలో నడిపిస్తూ, భావితరాలకు సన్మార్గం చూపే దిక్సూచులు ఉపాధ్యాయులేనని జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ అన్నారు. భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రవికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కేవలం అక్షరజ్ఞానాన్ని అందించడమే కాకుండా జీవిత విలువలు, మానవీయత, క్రమశిక్షణ, నైతిక విలువలను బోధించేవారే నిజమైన గురువులని అన్నారు. పాఠశాల స్థాయి నుంచే ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, ఆశీస్సులతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాలతో పాటు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల నృత్యాలు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహీమాన్, నాగేశ్వరరావు, సతీష్, విమలాదేవి, వెంకన్న, జక్కి నాగేశ్వర్, అబ్దుల్లా, ప్రసాద్, షమీన, రమేష్, శ్రీలత, కేజీబీవీ ఉపాధ్యాయినులు సుజాత, రాజమణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## యస్ ఫ్ ఎస్ స్కూల్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ఖమ్మం: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నేలకొండపల్లి ఎస్ ఫ్ ఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మిక్కిలి జోసెస్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణను నేర్పిస్తూ వారిని ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల జీవితంలో తొలి అడుగు నుంచే సరైన మార్గనిర్దేశం చేస్తూ, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న ఉపాధ్యాయుల సేవలు ఎప్పటికీ మరువలేనివని కొనియాడారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులను గౌరవిస్తూ, వారు చూపిన మార్గంలో ముందుకు సాగాలని సూచించారు.



## యూట్యూబ్ వ్యాఖ్యలపై బాధితుల ధర్నా

- పోచంపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులతో ఆందోళన
- మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలకు డిమాండ్
- కుటుంబ పరువుకు భంగం కలిగేలా వీడియో ప్రచారం చేశారని ఆరోపణ
- ఫిర్యాదు చేసినా స్పందన లేదంటూ బాధితుల ఆవేదన

తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి: సోషల్ మీడియాలో మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ వీడియోను ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం భూదాన్‌పోచంపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితులు కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు వినతిపత్రం అందజేశారు. బాధితుల కథనం ప్రకారం.. పురపాలక పరిధిలోని రేవణపల్లికి చెందిన యూట్యూబర్ ఏనుగు జైపాల్‌రెడ్డి తన తండ్రి ఏనుగు స్వామిరెడ్డితో నిర్వహించిన ఇంటర్వ్యూలో గ్రామానికి చెందిన గుల్లం శేఖర్ భార్య, తల్లిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయించారని ఆరోపించారు. అనంతరం ఆ వీడియోను యూట్యూబ్‌లో ప్రచారం చేయడంతో తమ కుటుంబ గౌరవానికి భంగం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీడియోపై సంబంధిత వ్యక్తులను ప్రశ్నించేందుకు వెళ్లిన సమయంలో స్వామిరెడ్డి తమపై దాడి చేశారని బాధితులు ఆరోపించారు. అంతేకాకుండా ఇంట్లో డబ్బులు పోయాయంటూ తమపై తప్పుడు కేసులు పెట్టించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసి, వాటిని ప్రచారం చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగేలా పోలీసులు తక్షణమే స్పందించాలని కోరారు. బాధితుల ఆందోళనకు గ్రామస్థులు మద్దతు తెలిపారు. ఈ ఘటనపై బాధితులు చేసిన ఆరోపణలపై పోలీసుల అధికారిక స్పందన తెలియాల్సి ఉంది.

## ఉట్కూరులో భక్తిపారవశ్యం.. వైభవంగా శ్రావణ బోనాలు

- ముత్యాలమ్మ, బొడ్రాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- బోనాలతో తరలివచ్చిన మహిళలు.. ఉట్టిపడిన ఆధ్యాత్మిక శోభ
- అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించిన భక్తులు
- వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొన్న గ్రామస్థులు

తొలివెలుగు, నిడమనూరు : నిడమనూరు మండలంలోని ఉట్కూరు గ్రామంలో



శ్రావణమాస బోనాల వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కురమేటి వసుమతి నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామదేవతలైన ముత్యాలమ్మ, బొడ్రాయి అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను అలంకరించి, ఊరేగింపుగా అమ్మవార్ల ఆలయాల వద్దకు తరలివచ్చారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణంతో పాటు ఆధ్యాత్మిక శోభ నెలకొంది. అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. బోనాల వేడుకల సందర్భంగా మహిళలు, యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ కుల సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, యువతీయువకులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాసుల కోసం కన్నతల్లినే కడతేర్చాడు!

మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామంలో జరిగిన మహిళా హత్య ఘటనలో నిందితున్ని మఠంపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. మద్యం వ్యసనానికి బానిసై, డబ్బుల కోసం స్వంత తల్లిని రోకలిబండతో బాది దారుణంగా హత్య చేసిన కన్నకొడుకును మఠంపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమందరాజు, మఠంపల్లి ఎస్ఐ ప్రవీణ్ లు మఠంపల్లి స్టేషన్ నందు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. సిఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం రఘునాథపాలెం గ్రామానికి చెందిన షేక్ సైదాబీ అనే మహిళకు సుభాని, దస్తగిరి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడైన సుభాని మొదటి నుంచి మద్యానికి తీవ్రంగా బానిసయ్యాడు. వివాహమైనప్పటికీ ప్రవర్తన మారకపోవడంతో భార్య అతనితో ఉండలేక పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అతను పెయింటింగ్ పనులు చేస్తూ, వచ్చిన డబ్బులతో మద్యపానానికి అలవాటుపడి తల్లితోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో భార్యను తీసుకురావాలని తల్లితో గొడవపడటంతో పాటు, మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని వేధించేవాడు. ఘటన జరిగిన రోజు ఉదయం మద్యం మత్తులో వచ్చిన సుభాని, డబ్బుల విషయమై తల్లి సైదాబీతో గొడవకు దిగాడు. కోపంతో ఆమెను కిందపడేసి, ఇంట్లోని రోకలిబండతో తలపై తీవ్రంగా బాదడంతో సైదాబీ అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం మృతదేహాన్ని వసారా నుంచి బయటకు లాగి, జరిగిన విషయాన్ని తన బావకు చెప్పి అక్కడ నుంచి పరారయ్యాడు. ఘటనపై సమాచారం అందుకున్న మఠంపల్లి పోలీసులు స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- పలు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు.. విద్యార్థుల స్వపరిపాలన దినోత్సవం
- జడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ హైస్కూల్‌లో రాధాకృష్ణన్‌కు నివాళులు
- గర్ల్స్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన విద్యార్థులు
- ముక్తాపూర్‌లో ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించిన నాయకులు



తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి : భూదాన్ పోచంపల్లి మండల, పట్టణ పరిధిలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ గురువుల పట్ల గౌరవాన్ని చాటుకున్నారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు వై. కిష్టయ్య ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అదేవిధంగా జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించి తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వపరిపాలన దినోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ పరిధిలోని ముక్తాపూర్ ప్రాథమిక పాఠశాల లోనూ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు పంతుల మధుబాబు ఆధ్వర్యంలో బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక నాయకులు పాఠశాల ఉపాధ్యా యులను శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమాల్లో సన్న నరసింహ, ఇట్ట ముని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# గురువులు చూపిన బాటే.. ఉన్నత శిఖరాలకు మార్గం



- శ్రీ వెంకటేశ్వర జెడ్పీహెచ్‌ఎస్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- పూర్వ విద్యార్థిగా అదే పాఠశాలకు సేవ చేయడం అదృష్టం: సర్పంచ్ వెంకట పాపిరెడ్డి
- క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి
- ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన పాఠశాల సిబ్బంది, నాయకులు

తొలివెలుగు, వలిగొండ: విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు, సలహాలను పాటిస్తూ క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, ఎంఈఓ సుంకోజు భాస్కర్ సూచించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం వలిగొండలోని శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి, పాఠశాల ప్రాంగణంలోని ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి మాట్లాడుతూ.. తాను ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేశానని తెలిపారు. తనకు గురువులు నేర్పిన క్రమశిక్షణ, విలువలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఇదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థిగా ప్రస్తుతం సర్పంచ్ హోదాలో గ్రామ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. విద్యార్థులు తమ గురువులను గౌరవిస్తూ, వారి మార్గదర్శకత్వంలో ముందుకు సాగాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పి. నాగేందర్, కే. సైదారెడ్డి, ఐ. గోపి, ఎ. శ్రీను, జె. విజయనిర్మల, పి. స్వామి, కే. నవీన్ కుమార్, కే. లక్ష్మి, సీహెచ్. కవిత, ఆర్. శివాజీ, ఎం. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.




# గురువే విద్యార్థి భవిష్యత్తుకు నిజమైన శిల్పి

- తూప్రాన్‌పేట ఎంజేపీటీలో వైభవంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు
- అలరించిన విద్యార్థుల స్వపరిపాలన కార్యక్రమం
- సర్వేపల్లి జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం: ఆర్‌సీఓ గౌతమ్‌రెడ్డి
- ఆర్‌సీఓ, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన విద్యార్థులు

తొలివెలుగు, చౌటుప్పల్ : విద్యార్థి భవిష్యత్తుకు బాటలు వేసే నిజమైన శిల్పి గురువేనని, తల్లిదండ్రులు జన్మనిస్తే ఆ జన్మకు సార్థకత చేకూర్చే సన్మార్గాన్ని ఉపాధ్యాయులు చూపిస్తారని ఆర్‌సీఓ గౌతమ్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలోని ఎంజేపీటీ పాఠశాల, కళాశాలలో శనివారం ప్రిన్సిపల్ బి. శిరీషారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌సీఓ గౌతమ్‌రెడ్డి, ప్రిన్సిపల్ శిరీషారెడ్డితో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్‌సీఓ మాట్లాడుతూ సాధారణ ఉపాధ్యాయుడి స్థాయి నుంచి దేశ తొలి పౌరుడిగా ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గురువుల మార్గదర్శకత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన స్వపరిపాలన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులు, అధికారులు తదితర పాత్రలను స్వీకరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. వివిధ పాత్రల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ బహుమతులు అందజేశారు. అనంతరం ఆర్‌సీఓ గౌతమ్‌రెడ్డితో పాటు ప్రిన్సిపల్ బి. శిరీషారెడ్డి, ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏటీపీలు జి. రవికుమార్, జి. మహేందర్‌రెడ్డి, బి.డబ్ల్యూ. శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







# పసిడి, వెండి రివర్స్‌గేర్

న్యూఢిల్లీ: అమెరికా--ఇరాన్ మధ్య యుద్ధానికి రెండు వారాల విరామంపై అంగీకారంతో ర్యాలీ చేసిన పసిడి, వెండి ఒక్క రోజు తిరగకుండానే గురువారం అమ్మకాల ఒత్తిడికి నష్టపోయాయి. కాల్పుల విరమణకు విరుద్ధంగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసిందంటూ, ఒప్పందం నుంచి తప్పుకుంటామని ఇరాన్ చేసిన హెచ్చరికలు, హర్మ్యూజ్‌ను మూసేసిందన్న వార్తలతో ముడి చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. ఈ ప్రభావంతో ఢిల్లీ మార్కెట్లో వెండి కిలోకి ఏకంగా రూ.7,800 నష్టపోయి రూ.2.43 లక్షలకు దిగొచి?చంది. అటు బంగారం 10 గ్రాములకు రూ.1,500 తగ్గి రూ.1,54,900 స్థాయికి పరిమితమైంది. 'పశి?చమాసియాలో కాల్పుల విరమణపై ఏర్పడ్డ సందేహాలతో బంగారం, వెండి ముందటి రోజు లాభపడిన స్థాయిలో నష్టపోయాయి. హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడంపై అనిశి?చతులు నెలకొనడం, ట్యాంకర్లు నిలిచిపోయాయన్న సమాచారం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపించింది.దీంతో ఇంధన ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న ఆందోళనలు తిరిగి నెలకొన్నాయి' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయంగా చూస్తే కామెక్స్‌లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 12 డాలర్లు పెరిగి 4,789 డాలర్ల వద్ద ఉంటే, వెండి 0.74 డాలర్ల నష్టంతో 74.83 డాలర్ల వద్ద ట్రేడయ్యింది.

## ఒక వైపు 30వేల లేఆఫ్స్.. మరోవైపు రూ.270 కోట్ల ఆఫర్!

ప్రముఖ టెక్ దిగ్గజం 'ఒరాకిల్' ఇటీవల ప్రపంచవ్యాప్తంగా సుమారు 30,000




మంది ఉద్యోగులను తొలగించి వార్తల్లో నిలిచింది. ఇలాంటి సమయంలో కంపెనీ చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ (జఖీూ)గా హిలరీ మ్యాక్సన్‌ను భారీ వేతనంతో నియమించింది. సంస్థ తీసుకున్న ఈ నిర్ణయం సర్వత్రా చర్చకు దారితీసింది. ఒరాకిల్ కొత్త సీఎఫ్‌ఓ హిలరీ మ్యాక్సన్‌కు కంపెనీ 9,50,000 డాలర్ల జీతం ఇవ్వనుంది. అదనంగా పనితీరు ఆధారంగా 2.5 మిలియన్ డాలర్ల వరకు బోనస్ పొందే అవకాశం ఉంది. అంతేకాకుండా 26 మిలియన్ డాలర్ల విలువైన ఈక్విటీ (షేర్లు) కూడా సంస్థ అందిస్తుంది. వీటిలో 80 శాతం సమయానికి అనుసంధానమైనవి కాగా, 20 శాతం పనితీరుపై ఆధారపడి ఉంటాయి.మ్యాక్సన్ తన ఈక్విటీని పూర్తిగా స్టాక్ ఆప్షన్ల రూపంలో లేదా స్టాక్ ఆప్షన్లు, రిస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్ల రూపంలో తీసుకునే అవకాశం ఉంది. అంతేకాకుండా కంపెనీ ఆమెకు 2,50,000 విలువైన రీలోకేషన్ అలవెన్స్ కూడా అందిస్తోంది. ఇవన్నీ కలిగి ఆమె మొత్తం ప్యాకేజీ సుమారు 29.7 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ.273 కోట్లు) చేరుకుంటుంది.హిలరీ మ్యాక్సన్ ఒరాకిల్‌లో చేరడానికి ముందు.. ష్నైడర్ ఎలక్ట్రిక్‌లో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, గ్రూప్ సీఎఫ్‌ఓగా పనిచేశారు. అంతే కాకుండా ఆమె ఏఈఎస్ కార్పొరేషన్‌లో 12 సంవత్సరాలు పాటు ఫైనాన్స్, స్ట్రాటజీ మొదలైన విభాగాల్లో పాటు కీలక బాధ్యతలు నిర్వహించారు.

**కంపెనీ భారీ లేఆఫ్స్**

ఇటీవల ఒరాకిల్ ప్రపంచవ్యాప్తంగా సుమారు 30,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఈ భారీ లేఆఫ్ ప్రభావం భారతదేశంలో సుమారు 12,000 మంది ఉద్యోగులపై పడింది. కంపెనీ ఉద్యోగులను తొలగించడానికి ప్రధాన కారణం.. కంపెనీ నిర్మాణ మార్పులు, ఖర్చు తగ్గింపు చర్యలు, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అని తెలుస్తోంది. ఈ కోతలు ఒరాకిల్ హెల్త్, సేల్స్, క్లౌడ్, కస్టమర్ సక్సెస్, నెట్‌సూట్‌లోని సిబ్బందిని ప్రభావితం చేసినట్లు సమాచారం.

## డిస్నీలో లేఆఫ్స్?

### 1,000 మంది ఉద్యోగులపై వేటు


ప్రపంచ వినోద రంగ దిగ్గజం 'వాల్ట్ డిస్నీ' తన ఖర్చులను తగ్గించుకునే పనిలో పడింది. ఇందులో భాగంగా రాబోయే కొద్ది వారాల్లో సుమారు 1,000 మంది ఉద్యోగులను తొలగించాలని కంపెనీ యోచిస్తోంది. ప్రధానంగా కంపెనీలోని మార్కెటింగ్ విభాగంపై ఈ ప్రభావం అధికంగా ఉండనుందని వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది.డిస్నీలో జరుగుతున్న ఈ తాజా పరిణామాలు సంస్థ అంతర్గత పునర్వ్యవస్థీకరణలో భాగమని తెలుస్తోంది. కొత్తగా నియమితులైన చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ (సీఎంఓ) అసద్ అయాజ్ కంపెనీ మార్కెటింగ్ గ్రూపును ఏకీకృతం చేసే పనిలో ఉన్నారు. 'ప్రాజెక్ట్ ఇమాజిన్' అనే రహస్య కోడ్ పేరుతో వ్యయ నియంత్రణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. జనవరిలో బాధ్యతలు చేపట్టిన అయాజ్ సంస్థలోని అన్ని మార్కెటింగ్ కార్యకలాపాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని భావిస్తున్నారు.కొత్త చేపట్టబోయే లేఆఫ్స్ డిస్నీ మొత్తం శ్రామిక శక్తిలో 1 శాతం కంటే తక్కువే. 2025 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి డిస్నీలో సుమారు 2,31,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. జోష్ డి అమారో డిస్నీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా బాధ్యతలు స్వీకరించక ముందే ఈ ఉద్యోగాల తగ్గింపు ప్రణాళికలు సిద్ధమైనట్లు సమాచారం.

# సమాజాన్ని నడిపించే మహాశక్తి ఉపాధ్యాయుడే

- ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
- గురువులే నిజమైన దేశ నిర్మాతలు: బీర్ల అయిలయ్య
- పీఆర్‌సీ అమలు, సీపీఎస్ రద్దుపై అసెంబ్లీలో గళమెత్తుతాం
- ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం



తొలివెలుగు, భువనగిరి: విద్య అనే ఆయుధంతో అజ్ఞానాన్ని పారద్రోలి, జ్ఞాన సమాజ నిర్మాణానికి పునాదులు వేసే ఉపాధ్యాయులే నిజమైన దేశ నిర్మాతలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. సమాజాన్ని మార్చే శక్తి రాజకీయాల్లో ఉంటే.. ఆ సమాజాన్ని సరైన మార్గంలో నడిపించే మహాశక్తి ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని అన్నారు. ఉపాధ్యాయులు తమ జీవితాలను విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితం చేస్తూ, తాము కరిగిపోతూ ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపే కొవ్వొత్తుల్లాంటి వారని కొనియాడారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలనే కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పడంలో గురువుల పాత్ర కీలకమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఇటీవల రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లులను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డుల సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీర్ల అయిలయ్య హామీ ఇచ్చారు. ముఖ్యంగా పీఆర్‌సీ అమలు, సీపీఎస్ రద్దు వంటి అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించి, ఉపాధ్యాయుల తరఫున అసెంబ్లీలో గళం వినిపిస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.






# పన్నీర్ తయారీ కేంద్రాలపై కొరడా

న ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా పన్నీర్‌తో పాటు ఇతర పాల ఉత్పత్తుల తయారీ, విక్రయ కేంద్రాలపై తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) అధికారులు తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంతో పాటు పరిసర జిల్లాల్లో మొత్తం 14 డెయిరీ యూనిట్లను 12 ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయి. పలు యూనిట్లలో పరిశుభ్రత లోపాలు, అనుమతిలేని పదార్థాల వినియోగం, పాల సేకరణకు సంబంధించిన సరైన రికార్డులు లేకపోవడం వంటి ఉల్లంఘనలను అధికారులు గుర్తించారు. కొన్ని పన్నీర్ తయారీ యూనిట్లలో లూజ్ పామ్ ఆయిల్, గ్లిసెరాల్ మోనోస్టియరేట్ వంటి పదార్థాలు ఉన్నట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి. కొన్ని ప్రాంతాల్లో బొద్దింకలు, ఈగల బెడదతో పాటు పరిశుభ్రత, పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించకపోవడం వెలుగులోకి వచ్చింది. కల్తీ అనుమానంతో మొత్తం 21 నమూనాలను సేకరించిన అధికారులు నాణ్యత పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. సుమారు రూ.7,19,340 విలువైన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఖానాపూ-ర్‌లోని శ్రీ మహాలక్ష్మి కేంద్రం, హయత్‌నగర్‌లోని అనిత



డెయిరీకి లోపాలను సరిదిద్దాలని ఇంప్రూవ్ మెంట్ నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నాదర్ గుల్‌లోని గీతా డెయిరీ, నార్మూల్ (మదర్ డెయిరీ)లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించింది.

# అక్కడ ఫిర్యాదు చేస్తే.. మాకేంటి?




**కమిషనర్ మేడం వచ్చి డ్యూటీ చేస్తుందా?**

**మేం కనిపించడం లేదా.. ఓ కానిస్టేబుల్ హల్‌చల్**

ఓ మహిళా కానిస్టేబుల్ దురుసుగా మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఎల్బీనగర్ ప్రాంతంలో ఓ దవాఖాన యజమాన్యానికి సంబంధించిన భాగస్వాముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దవాఖానలో కార్తిక్, నరేశ్‌తో పాటు మరికొందరు భాగస్వాములు ఉన్నారు. వారి మధ్య మనస్పర్థలు రావడంతో భాగస్వాములు విడిపోయారు. నాలుగు రోజుల కిందట నరేశ్ తన అనుచరులతో దవాఖాన వద్దకు వెళ్లాడు. తమకు కోర్టు అర్డర్ ఉందని, తమ వారికి కూడా ఇక్కడ ప్రాక్టీస్ చేసుకుంటారంటూ.. దవాఖానలో ఉన్న వారితో మాట్లాడారు. వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఒకరు డయల్ 100కు ఫోన్ చేశారు. ఎల్బీనగర్ పోలీసులు వెళ్లారు. ఓ వ్యక్తి, ఓ మహిళ అక్కడకు వెళ్లిన వారిని ప్రశ్నించారు. మీరెవరు... మేం కమిషనర్‌కు చెప్పామన్నారు. ఈ నేపథ్యంలో ఓ మహిళా కానిస్టేబుల్ స్పందిస్తూ.. పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే సరిపోతుందా....మేం కన్పించడం లేదా? అంటూ.. దురుసుగా మాట్లాడారు. కమిషనర్ వచ్చి డ్యూటీ చేస్తుందా...డయల్ 100కు ఫోన్ వస్తే మేం వచ్చామం'టూ కఠినంగా మాట్లాడటం చర్చనీయాంశమైంది. ఈ విషయమై ఎల్బీనగర్ పీఎస్ అధికారులతో మాట్లాడగా, గొడవ జరుగుతుందని పోలీసులు వెళ్లారని, అక్కడ జరిగిన విషయంపై సదరు వ్యక్తి చెప్పాడని.. ఆ విషయం అక్కడే సద్దుమణిగిందని చెప్పారు.



## బాలీవుడ్ ఎంట్రీపై భాగ్యశ్రీ బోర్సేకు షాక్..

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు.



## 'స్పిరిట్' నుంచి దీపికా ఔట్..

పాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, ట్రెండ్ సెట్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'స్పిరిట్' (రాజూఅతీత్). ఈ సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి అంచనాలు భారీగా ఉన్నాయి. అయితే ఈ చిత్రంలో ముందుగా హీరోయిన్‌గా ఫిక్స్ అయిన బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొనే తర్వాత తప్పుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రాజెక్ట్ నుంచి దీపికా ఎందుకు తప్పుకున్నారు అనే విషయంపై గతంలో రకరకాల ఊహాగానాలు వినిపించాయి. తాజాగా ఈ వివాదంపై దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సోదరుడు, నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇస్తూ సంచలన విషయాలను బయటపెట్టారు. ఈ ప్రాజెక్ట్ కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దాదాపు ఒకటిన్నర సంవత్సరాలుగా దీపికాతో టచ్‌లో ఉన్నారని, ఆమె ప్రతిభ మీద నమ్మకంతోనే లీడ్ రోల్ కోసం సంప్రదించామని ప్రణయ్ వెల్లడించారు. అయితే ఆ టైమ్‌లో ఆమె నటించిన సినిమాలు బ్లాక్‌బస్టర్స్ కావడంతో ఆమె డిమాండ్లు పూర్తిగా మారిపోయాయని ఆయన తెలిపారు. కేవలం భారీ రెమ్యూనరేషనే కాకుండా, ఏకంగా సినిమా నికర లాభాల్లో 10 శాతం వాటా (ప్రాతీశీటఙ్ రాష్ట్రుతీవ) కావాలని ఆమె పట్టుబట్టారని ప్రణయ్ స్పష్టం చేశారు. అంతేకాకుండా కేవలం ఆర్థికాంశాలే కాకుండా, షూటింగ్ కాల్షీట్లు మరియు ప్రొఫెషనల్ పని గంటల విషయంలోనూ ఆమె పెట్టిన కొన్ని కండిషన్స్ చిత్ర యూనిట్‌కు పొసగలేదని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్ట్ తమకు వర్కవుట్ కాదని భావించి పక్కన పెట్టాలని నిర్ణయించుకున్న తరుణంలో, సినిమా కథకు సంబంధించిన కొన్ని అత్యంత గోప్యమైన ఇంటర్నల్ విషయాలను ఆమె పీఆర్ (ప్రా=) టీమ్ ద్వారా బయటకు లీక్ చేయించారని ప్రణయ్ తీవ్రంగా ఆరోపించారు. ఇలా దర్శకుడు ముందస్తుగా నమ్మి చర్చించిన విషయాలు బహిర్గతం కావడం వల్ల సందీప్ రెడ్డి వంగా తీవ్ర మనస్తాపానికి గురయ్యారని తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఆమెను ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నుంచి తప్పించి, ఆ తర్వాతే నూతన నాయిక త్రిప్తి డిమ్రీ (Triptii Dimri) ని ఖరారు చేసినట్లు ప్రణయ్ వివరించారు.



## వరస ఫ్లాప్స్.. తెలుగు హీరో షాకింగ్ నిర్ణయం



ఒకప్పుడు కాస్త అటుఇటుగా ఉన్నాసరే సినిమాలు ఆడేసేవి. ఇప్పుడలా అస్సలు లేదు. ఏ మాత్రం కంటెంట్ తేడాగా ఉన్నాసరే తొలి ఆట నుంచి డిజాస్టర్ టాక్ లేదంటే విపరీతమైన ట్రోలింగ్ గ్యారంటీ. దీంతో యువ హీరోలకు ఏం చేయలో దిక్కుతోచట్లేదు. పలువురి దర్శకులు చెబుతున్న స్టోరీలో వింటున్నప్పటికీ పెద్దగా నమ్మకం కుదరట్లేదే ఏమో గానీ షాకింగ్ నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పుడా లిస్టులోకి మహేశ్ బాబు బావమరిది, హీరో సుధీర్ బాబు కూడా చేరినట్లు కనిపిస్తున్నాడు.2012లో 'శివ మనసులో శృతి' సినిమాతో హీరోగా కెరీర్ ప్రారంభించిన సుధీర్ బాబు.. ఇప్పటివరకు 20కి పైగా మూవీస్ చేశాడు. వీటిలో ప్రేమకథా చిత్రం, సమ్మోహనం తప్పితే చెప్పుకోదగ్గవి పెద్దగా లేవు. గతేడాది 'జటాధర' అంటూ పాన్ ఇండియా ప్రయత్నాలు చేశాడు గానీ ఘోరంగా బెడిసికొట్టింది. అప్పటినుంచి డైలామాలో పడిపోయిన సుధీర్ బాబు.. ఇప్పుడు తానే దర్శకుడు అవ్వాలని నిర్ణయించుకున్నాడట.కొన్నిరోజుల క్రితం హీరో రామ్ ఎలా అయితే తనే కథ రాసుకుని, హీరో కమ్ దర్శకుడు అయ్యాడో ఇ?ప్పుడు అదే దారిలోకి సుధీర్ బాబు కూడా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. కథ రాసుకుని హీరోగా నటించి దర్శకుడిగానూ మారే ప్రయత్నాలు సుధీర్ బాబు ఉన్నాడట. త్వరలో ఈ విషయమై ప్రకటన రానుందని టాక్.సుధీర్ బాబు, రామ్ అనే కాదు విశ్వక్ సేన్, కిరణ్ అబ్బవరం లాంటి యువహీరోలు కూడా తామే స్టోరీ రాసుకుని దర్శకులుగా మారిపోయారు. సిద్ధు జొన్నలగడ్డ, అడివి శేష్, నవీన్ పొలిశెట్టి లాంటి హీరోలైతె డైరెక్షన్ తప్పితే దాదాపు అన్ని పనులు చేస్తున్నారు.



## చరణ్, ఎన్టీఆర్ కూడా మల్టీప్లెక్స్ బిజినెస్‌లోకి?

తెలుగు స్టార్ హీరోలు ఓవైపు సినిమాలు చేస్తున్నప్పటికీ మరోవైపు బిజినెస్‌ల్లోకి కూడా ఎంట్రీ ఇస్తున్నారు. మిగతా వ్యాపారాల సంగతేమో గానీ మహేశ్ బాబు, అల్లు అర్జున్, రవితేజ, విజయ్ దేవరకొండ.. ఇప్పటికే మల్టీప్లెక్స్ బిజినెస్‌లోకి ?అడుగుపెట్టేశారు. అవి విజయవంతంగా సాగుతున్నాయి కూడా. ఇప్పుడు వీళ్లకు పోటీగా రామ్ చరణ్, ఎన్టీఆర్ కూడా ఇదే వ్యాపారంలోకి రాబోతున్నారని సోషల్ మీడియాలో తెగ మాట్లాడుకుంటున్నారు. హైదరాబాద్‌లో మహేశ్ బాబుతో ఏఎమ్‌బీ, ?అల్లు అర్జున్‌తో ఏఏఏ, రవితేజతో ఏఆర్‌టీ మల్టీప్లెక్స్‌ల్లో భాగస్వామి అయిన ఆసియన్ సినిమాస్ సంస్థతో రామ్ చరణ్ కూడా జట్టుకట్టారని.. త్వరలోనే ఏఆర్‌సీ పేరుతో హైదరాబాద్‌లోనే ఓ మల్టీప్లెక్స్ నిర్మించే ఆలోచనలో ఉన్నారని టాక్. మరోవైపు ఎన్టీఆర్.. సొంతంగా గచ్చిబౌలిలో ప్రీమియం మల్టీప్లెక్స్ కట్టే ఆలోచనలో ఉన్నాడని ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అంటున్నారు. మరి ఈ ఇద్దరి హీరోలు, థియేటర్ బిజినెస్‌లోకి ఎంట్రీ ఇచ్చే విషయమై గట్టిగానే పుకార్లు వినిపిస్తున్నప్పటికీ ఇందులో నిజానిజాల సంగతి ఏంటనేది తెలియాల్సి ఉంది. ఒకవేళ ఇదే నిజమైతే మాత్రం టాలీవుడ్ సినిమాల పరంగానే కాదు మల్టీప్లెక్స్‌ల పరంగా పోటీ పడుతున్నట్లు అవుతుంది.



## మొన్న ధనుష్.. ఇప్పుడు భారత క్రికెటర్‌తో రూమర్స్?

తెలుగులో మూడు నాలుగు సినిమాలే చేసినప్పటికీ హీరోయిన్ మృణాల్ ఠాకుర్‌ని ఇక్కడి ప్రేక్షకులు, మరీ ముఖ్యంగా యూత్ బాగానే ఓన్ చేసుకున్నారు. అందుకు తగ్గట్లే ఎప్పటికప్పుడు ఏదోలా మృణాల్ వార్తల్లో నిలుస్తూనే ఉంటుంది. కొన్నిరోజుల క్రితం హీరో ధనుష్‌తో డేటింగ్, పెళ్లి అని తెగ మాట్లాడుకున్నారు. కట్ చేస్తే ఇప్పుడు టీమిండియా స్టార్ క్రికెటర్ పంత్‌తో డేటింగ్‌లో ఉందంటున్నారు. దానికి కారణాలు కూడా చెబుతున్నారు. మృణాల్ ప్రస్తుతం హిందీలో వరసగా సినిమాలు చేస్తోంది. కొన్నిరోజుల క్రితం హీరో ధనుష్‌తో ఈమె రిలేషన్‌లో ఉందనే రూమర్స్ వచ్చాయి. కానీ వీటిని మృణాల్ కొట్టిపారేసింది. రీసెంట్‌గా రిషభ్ పంత్, ఈమె ఒకరినొకరు ఇన్ స్టాలో ఫాలో చేసుకోవడంతో వీళ్లిద్దరూ ఏమైనా డేటింగ్ చేస్తున్నారా అని బాలీవుడ్ మీడియా గుసగుసలాడుకుంటోంది. అయితే పంత్ గురించి ఇలాంటి రూమర్స్ రావడం కొత్తేం కాదు. చాన్నాళ్ల క్రితం బాలీవుడ్ నటి ఊ?ర్వశి రౌతేలాతో రిలేషన్ అంటూ పుకార్లు వచ్చాయి. కానీ అవన్నీ రూమర్స్ అని తర్వాత క్లారిటీ వచ్చింది. ఇప్పుడు కూడా సోషల్ మీడియాలో హడావుడి తప్పితే నిజంగా అలాంటిదేమైనా ఉందా? లేదా అనేది మృణాల్, పంత్ చెప్పాలి. అప్పటివరకు ఈ గోల తప్పదు.



Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com